

22 నుంచి రాష్ట్రమంతటా..
కులగణన

ఏడుకోట్ల మంది వివరాల కోసం హైటెక్ సర్వే
రెండు రోజుల్లో దరఖాస్తు నమూనా
విద్య, ఆర్థిక విధానాలకు ప్రాధాన్యం

బెంగళూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సామాజిక, ఆర్థిక, విద్య వివరాలను ప్రతి కుటుంబం నుంచి సేకరించేందుకు భారీగా కసరత్తు చేస్తోంది. సమీక్ష ప్రారంభానికి మరో 20 రోజులు మాత్రమే గడువు ఉంది. బీసీ కమిషన్ జరపనున్న సర్వేలో విశాలమైన దృష్టికోణం కలిగి ఉండాలని భావిస్తోంది. సమీక్షకు సంబంధించి బీసీ కమిషన్ చైర్మన్ మధుసూధన్ నాయక్ నేతృత్వం వహించనున్నారు. ఒకటి రెండు రోజుల్లోనే దరఖాస్తు నమూనా సర్వం సిద్ధం చేయనున్నారు.

పదేళ్ల క్రితం రాష్ట్రంలో కులగణన సర్వే జరిగింది. అప్పట్లో సమగ్ర సర్వే చేసినా పలు కారణాలతో ప్రభుత్వం ఆమోదించేందుకు జాప్యం జరిగింది. ప్రభుత్వాలు మారడంతో వెంటనే కొత్త ముఖ్యమంత్రులు కులగణన సర్వేను స్వీకరించేందుకు వెనుకడుగు వేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తొలిసారి కులగణన పేరిట ఏ కులానికి చెందిన వారు ఎంతమంది జనాభా ఉన్నారు. వారి ఆర్థిక పరిస్థితులు, విద్యావిధానంపై సమగ్ర నివేదిక ద్వారా రాష్ట్రప్రజల ముందు ఉంచాలని భావించారు. సర్వే నిర్వహణలోనే పలు అభ్యంతరాలు వచ్చాయి. ఆ తర్వాత జాప్యం తెలిసిందే. ఈ ఏడాది ప్రారంభంలో కులగణన సర్వే నివేదికను బీసీ కమిషన్ ప్రభుత్వానికి అప్పగించడం దాకా సజావుగానే సాగింది. నివేదికను స్వీకరించిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య కేబినెట్ ముందుకు తీసుకురావడంతోనే మంత్రుల మధ్య విబేధాలు తలెత్తాయి. కేబినెట్‌లోనే ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని, ఒక్కలిగ, లింగాయత సామాజిక వర్గానికి చెందిన మంత్రులు తేల్చి చెప్పారు. ప్రభుత్వంపై తిరగబడేందుకు ఒక్కలిగ సంఘం, వీరశైవ లింగాయతలు సిద్ధమయ్యారు. తమ జనాభాను తక్కువ చూపి మోసం చేశారని బహిరంగ ఆరోపణలకు సిద్ధమయ్యారు. పరిస్థితి దారి తప్పుతుండడంతో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుంది. పదేళ్ల కిందటి సర్వే ప్రకటించడం సరికాదని మెలిక పెట్టి ఏకంగా నిరాకరించింది. అధిష్ఠానం నిర్ణయానికి సై అంటూ ప్రభుత్వం మరోసారి సర్వేకు సిద్ధమైంది

ఆధార్‌కు అనుగుణంగా సమాచార సేకరణ

గతంలో జరిపిన సర్వేలో వ్యత్యాసాలు, గందరగోళాన్ని దృష్టిలో ఉంచుకుని ఆన్‌లైన్‌లోనూ సమాచారం సేకరించేందుకు అవకాశం ఇవ్వదలిచారు. ఈనెల 22నుంచి సర్వే నిర్వహించనున్నారు. అంతకంటే 2-3రోజులు ముందుగానే ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఇవ్వాలనే చర్చ జరిగింది. ఆధార్ ఆధారాలకు అనుగుణంగా సమాచారాన్ని సేకరిస్తే సమగ్రత ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే నగర, పట్టణ ప్రదేశాలలో నెట్‌వర్క్ ఉంటుందని సర్వేకు అభ్యంతరం ఉండదని, కానీ గ్రామీణ ప్రాంతాలలో ఆన్‌లైన్ ద్వారా సర్వే జరిపితే ఎక్కువమంది సద్వినియోగం చేసుకోలేకపోతారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మొబైల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ సౌలభ్యం ఉందా లేదా అని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రజలలో నైపుణ్యత, సమాచారం తెలుసుకునేందుకు ఆన్‌లైన్ విధానాలు కూడా ప్రవేశపెట్టదలిచారు.

ఉపకులాలను జాబితాలో చేర్చాలని డిమాండ్

1978 నుంచి ఇప్పటివరకు ఒక్కలిగ ఉపకులాలను వివిధ ఆధారాలతో బీసీలుగా గుర్తించి రిజర్వేషన్‌లు ప్రకటించారు. ఒక్కలిగ జనాభాలో 93 ఉప కులాలు ఉన్నాయి. అన్ని ఉపకులాలను ఒక్కలిగగానే పరిగణించాలని సంఘం డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే ప్రకటించిన 1400 కులాల జాబితాలో 73 ఉపకులాలు ఉన్నాయి. వీటితోపాటు ఇంకా 19 ఉపకులాలను జాబితాలో చేర్చాలని డిమాండ్ ఉంది. మరోవైపు వీరశైవలింగాయత సమాజంలో పలు ఉపకులాలు ఉన్నాయి. వాటిలో లింగాయత జవళి, పట్టసాలి, హరిగాణగరు, తబ్బలిగరు, హెండేవజీర, శెట్టరు, హోరిశెట్టరు, జాడశివాచార, లింగాయత మాలి, డోహరు, చమ్మారరు, కొరమరు, హొళెయరు, శీలవంతరు, హండెకురబరు, దాసరు/చిన్నదాసరు, మఠపతి, గంపణ, మల్గేరా, వీరమాహేశ్వర, శివపూజ లాంటివారు ఉన్నారు.

పరిగణనలోకి అభ్యంతరాలు

గతంలో అఖిల భారత వీరశైవ మహా సభ రాష్ట్రంలో బీసీ కమిషన్‌కు సమర్పించిన అభ్యంతరాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుత సర్వేలో వీరశైవలింగాయత సమాజంలో ఉపకులాలు ఉన్నా వారంతా లింగాయత జాబితాలో లేనివారుగా ఉన్నారు. వీరశైవ లింగాయత సమాజంలో ఒకే సమానత్వం వచ్చేలా ఒకే వృత్తి ఆధారంగా కులాలు, ఉపకులాలు ఉంటాయి. వాటిని గుర్తించకపోవడంతో తారుమారైంది. అగస లింగాయత, లింగాయత అగస, జంగమ లింగాయత, లింగాయత జంగమ, మడివాళ, మడివాళరు లింగాయత్, లింగాయత మేదర, మేదర లింగాయత, లింగాయత నేగి, నేకార లింగాయత వంటి కులాలు ఉన్నాయి. 24 ఉదాహరణలను వీరశైవలింగాయత సంఘం గతంలో అభ్యంతరం వ్యక్తం చేసింది.

విద్య, ఆర్థిక విధానాలకు ప్రాధాన్యం

సమీక్షలో ప్రధానంగా ఏ కులంలో ఎంతమంది ఉన్నారనే స్పష్టతతో పాటు వారి విద్య, ఆర్థిక విధానాలకు ప్రాధాన్యత ఇవ్వదలిచారు. భవిష్యత్తులో సంక్షేమపథకాల రూపకల్పనకు ఇదే మహత్తరమైన నివేదికగా తీసుకోదలిచారు. బడ్జెట్‌లో గ్రాంట్లు, రిజర్వేషన్లు కల్పించేందుకు ఇదే ప్రాతిపదకన తీసుకోదలిచారు. ఇందుకోసం అవసరమైన వివరాలను సేకరించనున్నారు.

జాబితా నుంచి మినహాయించాలి

సర్వేకోసం సిద్ధం చేసుకున్న జాబితాలో బ్రాహ్మణ క్రిస్టియన్, బ్రాహ్మణ ముస్లిం అనే కులాలను బ్రాహ్మణ జాబితా నుంచి మినహాయించాలని రాష్ట్ర బ్రాహ్మణసంఘం కమిషన్‌ను కోరింది. ఇటువంటి అంశాలు తమ ధార్మిక భావనలకు భంగం కలిగేలా ఉన్నాయని వివరించింది. బ్రాహ్మణులుగా ఉండేవారు క్రిస్టియన్, ముస్లింలుగా చేర్చేందుకు అవకాశం లేదని స్పష్టం చేసింది. కులాల ఆధారంగా సర్వే జరిపేందుకు ఆరువర్గాలుగా ప్రక్రియ జరుపడం సముచితమని వివరించింది. బ్రాహ్మణులలోను వెనుకబడిన వారు ఉన్నారని, దివ్యాంగులు, వృద్ధులు, సంక్లిష్ట పరిస్థితిలో ఉన్నారని వివరించింది. బ్రాహ్మణులను నిర్లక్ష్యం చేసినట్లుగా ఉందని, ఇదే కారణంగా కొందరు బ్రాహ్మణులమని చెప్పుకునేందుకు భయపడే పరిస్థితి ఏర్పడిందని వివరించింది.

ఇలా వివిధ కులసంఘాల సూచనలతోపాటు పదేళ్ల కిందట జరిగిన సర్వేలో చోటు చేసుకున్న తప్పిదాలను పునరావృతం కాకుండా సర్వే జరిపేందుకు బీసీ కమిషన్ తీవ్ర కసరత్తు సాగిస్తోంది.

నేడు వీఎస్‌కే స్నాతకోత్సవం

హజరు కానున్న గవర్నర్
వివిధ రంగాల్లో రాణించిన వారికి డాక్టరేట్లు ప్రదానం
వీసీ మునిరాజు


వివరాలు వెల్లడిస్తున్న వీసీ మునిరాజు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం(వీఎస్‌కే) 13వ స్నాతకోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ మునిరాజు తెలిపారు. బుధవారం యూనివర్సిటీ సమావేశ భవనంలో వీసీ విలేకరుల సమావేశం నిర్వహించారు. స్నాతకోత్సవానికి గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ హాజరువుతారని వివరించారు. న్యూఢిల్లీలోని ఇంటర్-యూనివర్సిటీ యాక్సిలరేటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ అవినాష్ చంద్ర పాండే, ఉన్నత విద్యాశాఖ మంత్రి వీకేఎస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎంసీ సుధాకర్ తదితర ప్రముఖులు కార్యక్రమానికి హాజరుకానున్నారన్నారు. స్నాతకోత్సవంలో ముగ్గురికి డాక్టరేట్లను ప్రదానం చేయనున్నామన్నారు. ఇర్ఫాన్ రజాక్, డాక్టర్ వసుంధర భూపతి, బావిహళ్లి నాగన్నగౌడలకు గౌరవ డాక్టరేట్లను అందజేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా యూనివర్సిటీలో యూజీ, పీజీ విద్యార్థులు 42 మందికి బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నట్లు వివరించారు. వివిధ విభాగాల్లో పరిశోధనలు జరిపిన 59 విద్యార్థులకు డాక్టరేట్లను ఇవ్వనున్నామన్నారు. అదేవిధంగా యూనివర్సిటీలో విద్యను అభ్యసిస్తూ ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్స్ ఇచ్చి సత్కరించడం జరుగుతుందన్నారు.

సేవాభావం పెరగాలి

మంత్రి దినేశ్ గుండూరావు



అక్సాన్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దినేశ్ గుండూరావు తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైద్యవిధానంలో వ్యాపార కోణం కాకుండా సేవాభావం పెరగాలని అప్పుడే అన్నివర్గాల ప్రజలకు మేలు చేకూరనుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్‌గుండూరావు అభిప్రాయపడ్డారు. గుణశీల ఆసుపత్రి 50ఏళ్ల సార్థక సంబరం సందర్భంగా అక్సాన్ చైల్డ్ డెవలెప్‌మెంట్ సెంటర్‌ను మంత్రి బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా సంతానసాఫల్యం ద్వారా ఎంతోమంది దంపతులతో పాటు మహిళల ఆరోగ్యంపట్ల అంకితభావంతో పనిచేసిందని కొనియాడారు. గుణశీల ఆసుపత్రి ఎండీ డాక్టర్ దేవికా గుణశీల మాట్లాడుతూ ఆక్సాన్ చైల్డ్ డెవలెప్‌మెంట్ ద్వారా పిల్లల సమగ్ర ఎదుగుదల, అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. పిల్లల శారీరక, మానసిక భావనాత్మకతతో సామాజిక సామర్థ్యానికి అనుగుణంగా చికిత్సలు అందించదలిచామన్నారు. మా తల్లి సులోచనా గుణశీల ఆసుపత్రిని ప్రారంభించారన్నారు. అదే సేవాభావం కొనసాగిస్తున్నామన్నారు. బసవనగుడి ఎమ్మెల్యే రవి సుబ్రమణ్య పాల్గొన్నారు.

సీఎంతో భారతీ విష్ణువర్ధన్ భేటీ


సీఎంతో నటి భారతి విష్ణువర్ధన్ తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): నటుడు విష్ణువర్ధన్ భార్య భారతీవిష్ణువర్ధన్, అల్లుడు అనిరుధ్ బుధవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యను భేటీ అయ్యారు. అధికారిక నివాసం కావేరిలో కలసినవారు విష్ణు స్మారక నిర్మాణానికి 10 కుంటల భూమి ఇవ్వాలని, విష్ణు జయంతిలోగా భూమికి అనుమతులు ఇవ్వాలని కోరారు. విష్ణువర్ధన్‌కు కర్ణాటక రత్న ప్రకటించాలని విన్నవించారు.

ఫయాజ్ బెయిల్ పిటిషన్ తిరస్కరణ

బెంగళూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): హుబ్బళ్ళిలో డిగ్రీ విద్యార్థిని నేహ హిరేమఠ్‌ను కళాశాల ప్రాంగణంలో దారుణంగా హతమార్చిన ఫయాజ్ బెయిల్ పిటీషన్‌ను కోర్టు తిరస్కరించింది. ఇటీవలే బెయిల్ పిటీషన్ తిరస్కరణకు గురికాగా ధారవాడ హైకోర్టు బెంచ్‌లో మరోసారి ఫయాజ్ ప్రయత్నించారు. పలు అంశాలను ప్రస్తావిస్తూ న్యాయవాదులు పిటీషన్ దాఖలు చేశారు. సుదీర్ఘంగా విచారణ జరిపిన ధర్మాసనం పిటీషన్‌ను తిరస్కరిస్తున్నట్టు తెలిపారు. 2024 ఏప్రిల్ 18న హుబ్బళ్ళిలోని కేఎల్ఈ టెక్నలాజికల్ యూనివర్సిటీలో నేహను హతమార్చిన విషయం తెలిసిందే.

మంత్రి అక్రమ ఆస్తుల వివాదం

కేజీఎఫ్ బాబుకు లోకాయుక్త నోటీసులు

బెంగళూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జమీర్ అహ్మద్ అక్రమాస్తుల వివాదంలో కేజీఎఫ్ బాబుకు లోకాయుక్త పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఏడు రోజులలోగా విచారణకు హాజరు కావాలని నోటీసులలో స్పష్టం చేశారు. ఇదే విషయమై కేజీఎఫ్ బాబు బుధవారం మీడియాతో మాట్లాడుతూ 2013లో జమీర్ అహ్మద్ ఇంటి నిర్మాణం కోసం అడిగిన మేరకు 3.50 కోట్ల రూపాయలు ఇచ్చానన్నారు. మా ఇద్దరి మధ్యా ఎలాంటి వ్యాపార వ్యవహారాలు లేవన్నారు. ఇప్పటికే రెండుమూడుసార్లు డబ్బులు అడిగానన్నారు. జమీర్ అహ్మద్‌ఖాన్‌పై ఈడీ దాడులు చేసినప్పుడు ఈ విషయం నిర్ధారణ అయ్యిందన్నారు. ఈడీ సమన్లు జారీ చేసినప్పుడు కూడా స్టేట్‌మెంట్ ఇచ్చానన్నారు. ప్రస్తుతం లోకాయుక్త నోటీసులు ఇచ్చిన మేరకు హాజరవుతానన్నారు.

విదేశీ మత ప్రచారాలు నిషిద్ధం

హోం మంత్రి పరమేశ్వర్



బెంగళూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బెంగళూరు ప్యాలెస్ గ్రౌండ్స్‌లో ఈనెల 5, 6 తేదీలలో జరిగే అంతర్జాతీయ మిలాద్-ఉన్-నబి సమ్మేళనంలో విదేశీ ధర్మగురువులు భారత్‌లో ధార్మిక కార్యక్రమాలలో భాగస్వామ్యం వహించడం, మత ప్రచారాలు చేయడం నిషేధంగా ఉందని హోం మంత్రి పరమేశ్వర్ స్పష్టత ఇచ్చారు. బుధవారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్యాలెస్ మైదానంలో మిలాద్-ఉన్-నబి సమ్మేళనానికి భారత గ్రాండ్ ముక్తిషేక్ అబూబకర్ అహ్మద్ ముస్లియార్‌తోపాటు యెమెన్ సూఫీసంత్ హబీబ్ ఉమర్‌లను ఆహ్వానించారు. ఈ మేరకు విదేశీ ధర్మగురువులు ఇక్కడ సమ్మేళనంలో పాల్గొని ప్రసంగించరాదని, ఇది వీసా నియమాలకు ఉల్లంఘన కానుందని నిర్వాహకులకు సూచించామన్నారు. భారతదేశ చట్టాలకు అనుగుణంగా విదేశీ ధర్మ గురువులు ప్రచారాలు చేయరాదన్నారు. వారిని ఆహ్వానించి ఉండవచ్చునని, నిబంధనలు ఉల్లంఘించేలా వ్యవహరించరాదన్నారు. విదేశీ ప్రాంతీయ రిజిస్ట్రేషన్ కార్యాలయం (ఎఫ్ఆర్ఆర్ఓ) కార్యక్రమాన్ని పర్యవేక్షించనుందన్నారు.


రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

నగరంలో జోరువాన

ఇబ్బందిపడ్డ జనం

బెంగళూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగర వ్యాప్తంగా బుధవారం సాయంత్రం జోరువాన కురిసింది. ఉద్యోగులు ఇళ్లకు చేరేందుకు నానా తంటాలు పడ్డారు. విద్యాసంస్థలు, ఆఫీసులు వదిలే సమయానికి వాన హోరెత్తడంతో ఎక్కడివారు అక్కడే నిలిచిపోయారు. ఓలా, ఉబెర్ క్యాబ్ సర్వీసులు సకాలానికి రాకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. నగర వ్యాప్తంగా వాన కొనసాగింది. పలు చోట్ల చెట్లకొమ్మలు పడిపోవడం, రోడ్లపై వర్షపునీరు నిలవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

పాలికె భవనాలకు భూమిపూజ చేస్తాం

ఐదు పాలికెలకు రూ.300 కోట్ల గ్రాంటు
గ్రేటర్ బెంగళూరు ప్రాధికార బోర్డును ఆవిష్కరించిన డీసీఎం డీకే శివకుమార్


గ్రేటర్ బెంగళూరు ప్రాధికార నేమ్‌బోర్డు


నేమ్ బోర్డును ఆవిష్కరించిన డీసీఎం డీకే తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఐదు పాలికెల కొత్త భవనాలను కన్నడ రాజ్యోత్సవం వేళ శంకుస్థాపన చేస్తామని డీసీఎం డీకే శివకుమార్ తెలిపారు. బుధవారం బీబీఎంపీ కేంద్ర కార్యాలయం పాత బోర్డుల స్థానంలో గ్రేటర్ బెంగళూరు ప్రాధికార (జీబీఏ) బోర్డులను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఎం మాట్లాడుతూ జీబీఏ పరిధిలో ఐదు పాలికెలకు 300 కోట్ల రూపాయలు గ్రాంటు కేటాయించినట్టు తెలిపారు. నగర పరిధిలో రోడ్ల సుస్థిరత, పాలనా దృష్ట్యా 500మంది ఇంజనీర్లను కేటాయిస్తున్నట్టు తెలిపారు. గతంలో 198 వార్డుల స్థానంలో ప్రస్తుతం 500 వార్డుల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రస్తావనలు వచ్చాయన్నారు. పాలికె పాలనా ఖర్చులు, వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్‌లకు సంబంధించి రూ.300కోట్లు విడుదల చేస్తామన్నారు. నగర ప్రజలు ఆర్కిటెక్చర్లు పాలికె కార్యాలయాలు ఎలా ఉండాలనేది సలహాలు ఇవ్వవచ్చునన్నారు. ఉత్తమమైన సలహాలకు రూ.5లక్షల బహుమానం ఇస్తామన్నారు. ప్రతి పాలికెలోనూ ఇద్దరు ఐఏఎస్, ఒకరు కేఏఎస్, చీఫ్ ఇంజనీర్లతోపాటు సిబ్బంది పనిచేస్తారన్నారు. నగరంలో ఉత్తమ పాలన, ప్రభుత్వ సేవలు ప్రజలకు సరళీకృతంగా అందేలా ఉండాలనేది తమ ఆశయమన్నారు. మహేశ్వరరావు జీబీఏ చీఫ్ కమిషనర్‌గా, పాలనాధికారిగా ఎన్నికలు జరిగేవరకు పనిచేస్తారన్నారు. గ్రేటర్ బెంగళూరు అనేది ఇంగ్లీషు పదమని మల్లేశ్వరం ఎమ్మెల్యే అశ్వత్థనారాయణ అభ్యంతరం తెలిపారని మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా, ఆయన ఏం పేరు సూచిస్తారో సలహా ఇస్తే బాగుంటుందన్నారు. జీబీఏ నుంచి బెంగళూరు అభివృద్ధి జరగనుందన్నారు. కార్యక్రమంలో చిక్కపేట ఎమ్మెల్యే ఉదయ్ గరుడాచార్, యశ్వంతపుర ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్, బీడీఏ చైర్మన్ హారిస్ తదితరులు ఉన్నారు.

రామయ్య వీవీతో న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీ ఒప్పందం

బెంగళూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): రామయ్య యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్‌తో అల్బనీలోని స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ ఒప్పందం కుదుర్చుకుంది. జ్ఞానసముపార్జన, నానో స్కేల్ సైన్స్ ఇంజనీరింగ్ రంగంలో సంయుక్తంగా ఒప్పందం చేసుకున్నట్టు యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ ఎంఆర్ జయరాం తెలిపారు. ఢిల్లీలో జరిగిన సెమికాన్ ఇండియా 2025 సదస్సులో ఒప్పందం జరిగింది. జయరాం మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలో ఆధునికతతోపాటు భారత్‌లో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న సెమి కండక్టర్‌లో ఎకోసిస్టమ్‌ను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు దోహదపడనుందన్నారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో భవిష్యత్తుకు అవసరమైన హ్యూమన్ ఇంటెలిజెన్స్, ఏఐ, సాంకేతిక సంయోజన, నానో టెక్నాలజీ, రోబోటిక్స్ వంటి కొత్త అంశాలపై రామయ్య యూనివర్సిటీ విద్యార్థులకు పరిశోధనలకు ఈ ఒప్పందం కీలకం కానుందన్నారు. ఎస్‌యూఏఎస్‌పై అల్బనీ సహకారంతో నానో స్కేల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో 2026-27లో బీటెక్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అల్బనీ యూనివర్సిటీ చైర్మన్ హవిదన్ రోడ్రిగజ్ మాట్లాడుతూ రామయ్య యూనివర్సిటీతో ఒప్పందం ద్వారా అంతర్జాతీయస్థాయిలో సహకారం పరిశోధనలకు అనుకూలం కానుందన్నారు. నానో టెక్నాలజీ ప్రోగ్రామ్‌ల ద్వారా ఆధునిక పరిశ్రమలో అవసరమైన రీసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్‌కు సంపూర్ణంగా సహకరిస్తామన్నారు. అల్బనీ రీసెర్చ్ అండ్ డెవలెప్‌మెంట్ విభాగం వైస్ చైర్మన్ ప్రొఫెసర్ థెన్ కురసి కేశవదాస్ మాట్లాడుతూ సెమికాన్ ఇండియావేళ ఈ ఒప్పందం ప్రత్యేకత చాటుకోనుందన్నారు. సెమికండక్టర్ పరిశ్రమలో క్రియాశీలక ప్రగతికి సహకారం కానుందన్నారు. రామయ్య వైస్‌చాన్స్‌లర్ కేకే రైనా మాట్లాడుతూ దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ విస్తరణకు ఈ ఒప్పందం సహకారం కానుందన్నారు. దేశంలో సెమికండక్టర్ ఇండస్ట్రీ 110 బిలియన్ డాలర్లకు చేరనుందని అభిప్రాయపడ్డారు.


ఒప్పంద పత్రాలు చూపుతున్న ఎంఆర్ జయరాం, హావిదన్ రోడ్రిగజ్

క్రైం కార్నర్

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


మృతి చెందిన వరుణ్

విడపనకల్లు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన సింగాడి రామాంజనేయులు కుమారుడు వరుణ్(8) బుధవారం సాయంత్రం ఈతకు వెళ్లి మృతి చెందాడు. మూడో తరగతి చదువుతున్న వరుణ్ సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చాక ఎస్సీ కాలనీకి ఆనుకుని ఉన్న జీబీసీ పిల్ల కాలువలో తన స్నేహితులతో కలిసి ఈత కొట్టేందుకు వెళ్లాడు. బీరప్ప బ్రిడ్జి వద్ద ఈత కొడుతూ ప్రమాదవశాత్తు కాలువ ప్రవాహంలో కొట్టుకుపోయాడు. బాలుడి స్నేహితుల సమాచారంతో స్థానికులు కాలువ వద్దకు వెళ్లి గాలింపు చేపట్టగా బాలుడు ఆర్ కొట్టాల రోడ్డు బ్రిడ్జి వద్ద కనిపించాడు. వెంటనే నీటిలో నుంచి విద్యార్థిని బయటకు తీసి ఉరవకొండ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. రామాంజనేయులుకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారు ఉన్నారు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కాగా రామాంజనేయులు దంపతులు జీవనోపాధి కోసం బళ్లారిలో ఉంటూ కుమారుడిని తన తల్లి వద్ద విడపనకల్లులోనే ఉంచి చదివిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


అంజనారెడ్డి(ఫైల్)

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగాల గ్రామానికి చెందిన రైతు అంజనారెడ్డి(58) అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు అంజనారెడ్డికి 6 ఎకరాల పొలం ఉంది. గత ఐదేళ్లుగా వేరుశనగ, కంది పంటలను సాగు చేశాడు. ఇందుకోసం రూ. 15లక్షల దాకా అప్పు చేశాడు. పంటలు పండకపోవడంతో అప్పులు ఎలా తీర్చేదని మథనపడేవాడు. ఈక్రమంలోనే అనారోగ్యానికి గురైయ్యాడు. ఒక పక్క అప్పులు, మరోపక్క ఆరోగ్య సమస్యలతో తీవ్రంగా కుంగిపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కసాపురం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించా రు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య మాధవి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

గోరంట్లలో టీకొట్టు నిర్వాహకుడు..

గోరంట్ల, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయం ఎదుట టీ కొట్టు నిర్వహిస్తున్న శివశంకర్(40) బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గ్రామస్థులు తెలిపిన మేరకు మండలంలోని బుచేపల్లి గ్రామానికి చెందిన శివశంకర్, సుజాత దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల గ్రామం వదిలి గోరంట్లలో నివాసముంటు, భార్యభర్తలిరువురు టీకొట్టు నిర్వహిస్తున్నారు. కాగా, బుధవారం పాలసముద్రం వద్ద పాఠశాలలో చదువుతున్న కుమారుడిను పలకరించి వస్తానంటూ భార్యకు చెప్పి వెళ్లిన శివశంకర్ స్వగ్రామంలో ఊరి చివర ఉన్న సొంత పొలంలో చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇటీవల ఇళ్లు తాకట్టు పెట్టినట్లు సమాచారం. సీఐ శేఖర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో యువతి..


పుష్పావతి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి, తిరుమలమ్మ దంపతుల కుమార్తె పుష్పావతి(19) బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కసాపురం పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు పుష్పావతి ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉండేది. కొద్ది రోజులుగా ఈమె కడుపునొప్పితో బాధపడుతుండేది. పలు చోట్ల చికిత్సలు చేయించిన నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపంతో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోటంకలో యువకుడు..


సుబ్బరాయుడు (ఫైల్)

గార్లదిన్నె, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక గ్రామంలో జెన్నె సుబ్బరాయుడు (35) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు జెన్నె సుబ్బరాయుడు, రమాదేవి దంపతులు గ్రామంలో కూలి పనులు చేసుకునేవారు. సుబ్బరాయుడు బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు తీసి చూడగా సుబ్బరాయుడు విగతజీవిగా ఫ్యానుకు వేలాడుతు కనిపించాడు. దీంతో వారు బోరుమనడంతో చుట్టు పక్కల వారు వచ్చి, ఉరికి వేలాడుతున్న సుబ్బరాయుడును కిందికి దించి పరీక్షించి, మృతి చెందినట్లు గుర్తించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి

● కొడుకులిద్దరిపై హత్య కేసు

గోరంట్ల , సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉగ్రారంపల్లికి చెందిన వడ్డె రంగప్ప (62) గాయపడి, కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడికి సోముశేఖర్, చంద్రశేఖర్ అనే ఇద్దరు కుమారులు అదే గ్రామంలో విడిగా నివాసాలున్నారు. రంగప్ప భార్యతో కలిసి జీవిస్తున్నారు. మృతుడు తాగుడుకు బానిసై తరచూ భార్యను హింసిస్తుండడంతో ఈనెల 1న కుమారుల వద్దకు వెళ్లింది. కుమారులు ఆగ్రహంతో తండ్రి రంగప్పను కట్టెతో కొట్టారు. గాయపడిన రంగప్ప ఓడీసీ మండలం చింతమానుపల్లిలో ఉంటున్న కుమార్తె అరుణమ్మకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. దీంతో కుమార్తె ఉగ్రారం పల్లకి చెందిన తండ్రిని తనతోపాటు తీసుకెళ్లి, చికిత్స చేయించారు. అనంతరం ఇంటిలో విశ్రాంతి పొందుతుండగా, తలనొప్పి తీవ్రంకావడంతో వెంటనే కదిరి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతి చెందాడు. వానవోలు వీఆర్‌ఓ లక్ష్మీనరసమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


పుట్లూరు పెద్దారెడ్డి (ఫైల్)

పుట్లూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని పి. చింతలపల్లి గ్రామానికి చెందిన రైతు పుట్లూరు పెద్దారెడ్డి (38) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు పెద్దారెడ్డికి 7ఎకరాల భూమి ఉంది. వీటిలో అరటి, మొక్కజొన్న పంటలు సాగు చేయగా నష్టపోయాడు. పెట్టుబడులకు చేసిన అప్పులు పెరిగిపోయాయి. రుణదాతల ఒత్తిడితో మనస్తాపం చెంది ఈ నెల 28న ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స మూడు రోజుల పాటు వైద్యం చేయించుకొని డబ్బులు లేక ఇంటికి వచ్చారు. పరిస్థితి విషమించడంతో మళ్లీ అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. మృతుడి భార్య వీణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టమోటా కిలో రూ.21

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో బుధవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.21తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠ ధర రూ.14, సరాసరి రూ.17తో విక్రయాలు జరిగాయన్నారు.

పంచరత్నాలు

ఉమ్మడి జిల్లాలో ఐదుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

అనంతపురం విద్య/కొత్తచెరువు/రొద్దం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇచ్చే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఉమ్మడి జిల్లాలో ఐదుగురిని వరించాయి. ఈమేరకు బుధవారం అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రంలో 78మందికి ఈ అవార్డులు ప్రకటించగా, అనంత జిల్లాకు చెందిన ముగ్గురు , శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఇద్దరికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు దక్కాయి. వీరిలో రాప్తాడు నియోజకవర్గం ఆత్మకూరు జడ్పీ హైస్కూల్‌లో బయాలజీ టీచర్‌గా పనిచేస్తున్న ఉప్పరపల్లి శైలజ, గుత్తి మండలం అబ్బేదొడ్డి జడ్పీ హైస్కూల్ ఫిజికల్ సైన్స్ టీచర్ బండి శ్రీనివాసులు, పామిడి ఏపీమోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న అరుణ ఉన్నారు. కొత్తచెరువు మండలం బండ్లపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మాణిక్యం మహమ్మద్ ఇషాక్, రొద్దం మండలం కోగిర జడ్పీ హైస్కూల్‌లో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న జాబిలి చాంద్‌బాషా ఉన్నారు. వీరు ఈనెల రాజధానిలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఉపా ధ్యాయ దినోత్సవంలో సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారాలోకేశ్ చేతులమీదుగా అవార్డులు స్వీకరించనున్నారు.

● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన బండ్లపల్లి జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మాణిక్యం మహమ్మద్ ఇషాక్ 30 ఏళ్లుగా బోధనా వృత్తిలో కొనసాగుతున్నారు. మూడు దశాబ్దాల అనుభవంలో ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి శ్రమించారు. పిల్లలకు భాషపై పట్టు రావడానికి ఎంతగానో కృషి చేశారు. అలాగే కమిసమ్మేళనాలు నిర్వహించారు. మాణిక్యమ్మ శతకం, ద్విశతఆటవెలది చందస్సులో 216 పద్యాల పుస్తకాన్ని రచించారు. ఈ సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించింది.



● రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా జాబిలి చాంద్‌బాషా (జయచంద్ర) ఎంపికయ్యారు. రొద్దం మండలం కోగిర జడ్పీ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న జాబిలి చాంద్‌బాష, పాఠశాల అభివృద్ధి కోసం విశేష కృషి చేసినందుకు అవార్డు దక్కింది. దీనిపై పాఠశాల సహచర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని జాబిలి చాంద్ బాషా పేర్కొన్నారు.



సంతోషంగా ఉంది



రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కడం సంతోషం కలిగిస్తోంది. నేను డీఎస్సీ-1996లో ఎస్జీటీగా ఎంపికయ్యా. 2009 స్కూల్‌అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొంది ఉరవకొండలో పదేళ్లు పని చేశా. ఇపుడు ఆత్మకూరు హైస్కూల్‌లో పని చేస్తున్నా. ఎక్కడకు వెళ్లినా పర్యావరణం విషయంలో పిల్లలకు మంచిగా తీర్చిదిద్దుతూనే ఉన్నా. నా సొంత బిడ్డల్లా భావించి పిల్లలకు బోధన చేసి వారిలో మార్పు తీసుకొస్తున్నా. పిల్లలకు నేనంటే ఎంతో ఇష్టం. ఇపుడు అవార్డు రావడానికి ఇదే అవకాశం కల్పించింది.

- శైలజ, బయాలజీ టీచర్, జడ్పీహెచ్ఎస్, ఆత్మకూరు.

మరపురాని గుర్తింపు



నేను 2015 డీఎస్సీలో టీజీటీగా ఎంపికయ్యా, ఆతర్వాత 2018 డీఎస్సీలో అదే మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పోస్టుకు పరీక్షరాసి సెలెక్ట్ అయ్యా. అప్పటి నుంచి ప్రిన్సిపాల్‌గా పామిడిలో విధులు నిర్వహిస్తూ స్కూల్ అభివృద్ధితో పాటు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు శ్రమిస్తున్నా. చిన్నవయసులోనే రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు దక్కడం ఎంతో ఆనందం కలిగిస్తోంది. జీవితంలో ఇది మరిచిపోని గుర్తింపు.

- అరుణ, ఏపీమోడల్‌స్కూల్, ప్రిన్సిపాల్, పామిడి

వినూత్న బోధనతోనే గుర్తింపు



నేను పిల్లలకు తొలి నుంచి వినూత్న విధానంలో బోధన చేస్తూ వస్తున్నా. డీఎస్సీ- 1996లో ఎస్జీ టీచర్‌గా ఎంపికయ్యా. ఆతర్వాత 2003డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా పరీక్ష రాసి ఫిజిక్స్ టీచర్‌గా సెలెక్ట్ అయ్యా. అప్పటి నుంచి పిల్లలకు సాంకేతిక విధానంలో సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నా. 2017లో జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొని ఆంధ్రప్రదేశ్ తరఫున మొదటి బహుమతి పొందాం. ఈక్రమంలోనే ప్రభుత్వం రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేయడం ఎంతో గర్వంగా ఉంది.

- బండి శ్రీనివాసులు, ఫిజికల్‌సైన్స్ టీచర్, అబ్బేదొడ్డి, గుత్తిమండలం.

జిల్లాలో 9 బార్లకు రీ నోటిఫికేషన్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 9 బార్లకు రీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురంలో -3, గుంతకల్లు-2, తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం, రాయదుర్గంలో ఒకటి చొప్పున బార్లు ఉన్నాయన్నారు. 2025-28 నూతన బార్ పాలసీలో భాగంగా గతంలో లాటరీ నిర్వహించగా జిల్లాలో మిగిలిపోయిన ఈ 9 బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందన్నారు. ఈనెల 14న సాయంత్రం 6 గంటల వరకూ ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవచ్చున న్నారు. 15న ఎక్సైజ్ ఈఎస్ కార్యాలయంలో కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ తీస్తామన్నారు.

ఉచిత బ్యాంకింగ్ శిక్షణ

ధర్మవరం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో డిగ్రీ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనలతో సంస్కృతి సేవా సమి తి ఆధ్వర్యంలో ఉచిత బ్యాంకింగ్ శిక్షణ ఏర్పాటు చేసినట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. నంద్యాల లోని గురు రాఘవేంద్ర కోచింగ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్టు ఆ యన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న ప్రవేశపరీక్ష ఉంటుందని ఉత్తమ ప్రతిభ కనబరచిన 50 మందిని ఎంపిక చేసి ఉద్యోగం సాధించేవరకు ఉచిత భోజనం, వసతి, ప్రొఫెషనల్ శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 79982 56789, 9490442576 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

తాడిపత్రిలో భారీ పోలీసు బందోబస్తు


డీఎస్పీ ఆఫీసు వద్ద పెద్దఎత్తున పోలీసులు

తాడిపత్రి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నాడనే సమాచారంతో పోలీసులు బుధవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తున్నాడని తెలియడంతో జేసీప్రభాకర్‌రెడ్డి డీఎస్పీ ఆఫీసు వద్దకు వెళ్లాడని విశ్వసనీయ సమాచారం. కానీ పెద్దారెడ్డి రాలేదని తెలియడంతో ప్రభాకర్ రెడ్డి కూడా అక్కడకు వెళ్లకుండా విరమించుకోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. కానీ ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆలోచనతో సబ్‌డివిజన్ నుంచి పెద్దఎత్తున పోలీసు బలగాలను రప్పించారు. సబ్‌డివిజన్‌తోపాటు పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి సీఐలు, ఎస్ఐలు హుటాహుటినా డీఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ఇప్పటికే మూడురోజుల క్రితం కాకర్ల రంగనాథ మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గాల మధ్య జరిగిన ఘర్షణకు తలమునకలైన పోలీసులు మరోపక్క పెద్దారెడ్డి రాకతో పోలీసుల్లో నిద్రపట్టలేదు.

తిమ్మంపల్లికి చేరుకున్న పెద్దారెడ్డి అనుచరులు

యల్లనూరు: తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి స్వగ్రామమైన తిమ్మంపల్లికి బుధవారం తెల్లవారుజామున ఆయన అనుచరులు చేరుకోవడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లడానికి బుధవారం ఉదయాన్నే రావాలని తన అనుచరులకు సమాచారం అందించారు. అయితే మంగళవారం రాత్రి పోలీసులు జరిపిన చర్చలతో తాడిపత్రికి వెళ్లే కార్యక్రమం వాయిదా వేసుకున్నారు. అయినా బుధవారం ఉదయాన్నే పుట్లూరు, యల్లనూరు మండలాలకు చెందిన ఆయన అనుచరులు తిమ్మంపల్లికి చేరుకున్నారు. దీంతో ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో బందోబస్తు నిర్వహించారు.

యూరియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా విషయంలో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి బుధవారం యూరియా సరఫరా, డిమాండ్‌పై జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్పీలు, వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీసీలో జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా ఎస్పీ జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన చోట రైతు సేవ కేంద్రాలలో యూరియా స్టాక్‌ను ఉంచాలన్నారు. పంట సాగును బట్టి ఎక్కడ అవసరమో అక్కడ యూరియాను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టీచర్స్‌డేకు నిధులు మంజూరు

అనంతపురం విద్య, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న జిల్లా కేంద్రంలో నిర్వహించే వేడుకలకు ప్రభుత్వం రూ.లక్ష నిధులు మంజూరు చేసింది. ఆరోజు విద్యాశాఖ ఆధ్వర్యంలో 60మంది ఉత్తమ టీచర్లను కలెక్టరు, జేసీ, ప్రజాప్రతినిధుల చేతులు మీదుగా సత్కరించ నున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. గత వైసీపీ పాలనలో నిధులు ఇవ్వకపోవడంతో చందాల ద్వారా టీచర్స్‌డేను నిర్వహించేందుకు ఇబ్బంది పడేవారు. వీటిని గమనించిన ప్రస్తుత ప్రభుత్వం ఈ టీచర్స్‌డేను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి జిల్లాకు రూ.లక్ష నిధులు మంజూరు చేసింది. సమగ్రశిక్ష నుంచి వెంటనే ఆ నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యార్థుల చేత చేపల శుభ్రంపై డీఈఓ ఆగ్రహం

అనంతపురం విద్య/కణేకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలం యర్రగుంట జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థుల చేత చేపలు శుభ్రం చేయించడంపై డీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు చేపలను శుభ్రం చేసే ఫొటోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం ఓ కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై కలెక్టరు వినోద్‌కుమార్, ఆర్జేడీ శామ్యూల్ ఆరా తీశారు. దీంతో డీఈఓ చేపల శుభ్రం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని గుత్తి డివిజన్ డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డిని ఆదేశించారు.

భూసార సంరక్షణా విభాగం ఈఈగా పోలప్ప

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం భూసార సంరక్షణా విభాగం ఈఈగా పోలప్ప బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కదిరి భూసార సంరక్షణా విభాగం డీఈగా పనిచేస్తున్న పోలప్పను ఉద్యోగోన్నతిపై అనంతపురం భూసార సంరక్షణా విభాగం ఈఈగా బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు పలువురు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పట్టపగలే చోరీ

గోరంట్ల , సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలోని వస్త్ర దుకాణం ఎదుట ద్విచక్రవాహనంలో ఉంచిన రూ.4లక్షల నగదును బుధవారం చోరీ చేశారు. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన కరణం భుజంగరావు, హరిప్రియ దంపతులు ద్విచక్రవాహనంపై గోరంట్లలోని స్టేట్ బ్యాంక్‌కు వచ్చారు. బెంగుళూరుకు వెళ్లాలన్న ఉద్దేశ్యంతో బ్యాంక్‌లో రూ.4 లక్షల నగదును డ్రాచేసిన అనంతరం సమీపంలోని దుకాణంలో దుస్తులు కొనుగోలు చేయడానికి వెళ్లారు. దుస్తులు కొనుగోలు చేస్తుండగా, వాహనంలో సైడ్ బ్యాగ్‌లో ఉన్న నగదు చోరీ జరిగింది. వెంటనే ఈవిషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా, ఇద్దరు మహిళలు బ్యాంక్ వద్దనుంచి వెంబడిస్తూ వచ్చి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.చోరీ అనంతరం నిందితులు కారులో బెంగుళూరు వైపు వెళ్లినట్లు తెలిసింది.

గ్రామీణప్రాంతాల అభివృద్ధే కియ లక్ష్యం

సంస్థ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కప్ డాంగ్లీ


చోళేమర్రిలో రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ చేస్తున్న డాంగ్లీ

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కియ ఇండియా పనిచేస్తుందని ఆ సంస్థ ఇండియా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కప్‌డాంగ్లీ అన్నారు. సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా పెనుకొండలోని వెంకటాపురంతండాకు వెయ్యి సోలార్ వీధి దీపాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామంలో సోలార్ వీధిదీపాలపై యువతకు అవగాహన కల్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో కప్‌డాంగ్లీ మాట్లాడుతూ మొదటి విడతలో 250సోలార్ వీధిదీపాలు ఏర్పాటు చేసిందన్నారు. మరో వెయ్యి సోలార్‌దీపాలు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గతఏడాది మొదటి దశలో రైతుల ఆదాయం పెంపొందించేందుకు 544మంది రైతులతో పండ్ల మొక్కలు నాటించి, వారి ఆర్థిక అభివృద్ధికి కృషిచేశామన్నారు. ఈక్రమంలోనే బుధవారం రొద్దం మండలంలోని చోళేమర్రి గ్రామంలో 600మంది రైతులకు, 40వేల మొక్కలు, పండ్ల తోటలు సాగుచేసే రైతులకు ఉపాధి పథకం ద్వారా డ్రిప్ పరికరాలు అందించామన్నారు. మొక్కలను కాపాడుకునేందుకు ప్రత్యేక నిపుణులచే ప్లాంట్‌కేర్ అడ్వైజ్ సేవలందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వైజర్ డాంగిల్‌మా తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవలకు ప్రతిరూపం

శ్రీసత్యసాయి వైద్యసేవలపై కేరళ ఎంపీ


ప్రసంగిస్తున్న కేరళ ఎంపీ ప్రేమచందన్

పుట్టపర్తి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిస్వార్థ సేవలకు శ్రీసత్యసాయి వైద్యసేవలు పేరొందాయని కేరళ రాష్ట్రం కొల్లం జిల్లా ఎంపీ ఎన్‌కే ప్రేమచందన్ కొనియాడారు. ప్రశాంతి నిలయంలో బుధవారం కేరళ ఓనం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. కేరళ ఎంపీ ప్రసంగిస్తూ సత్యసాయి వైద్యసేవల్లో నో క్యాష్ కౌంటర్, నో బిల్‌సెంటర్ ఉంటుందన్నారు. నిస్వార్థంతో చేసే సేవలు దేవుడికి చేరుతాయన్నారు. అనంతరం కొజీ కోడ్ విద్యార్థులు సత్యసాయి ఆధ్యాత్మికతపై సంగీత నృత్యాన్ని ప్రదర్శించారు. గంటపాటు మధుర గాన, నృత్యంతో భక్తులు తన్మయం చెందారు.

పెన్నహోబిలం ఇన్‌చార్జి ఈవోగా తిరుమల రెడ్డి

ఉరవకొండ,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా తిరుమల రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు ఇక్కడ పనిచేస్తున్న ఈవో రమేష్ బాబు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో జిల్లా దేవదాయ శాఖాధికారి బాధ్యతలు స్వీకరించారు.

విష ప్రభావంతో రైతు మృత్యువాత


చిన్నపెద్దప్ప (ఫైల్)

పెద్దవడుగూరు, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన చిన్నపెద్దప్ప (50) అనే రైతు విషప్రభావానికి గురై చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు చిన్నపెద్దప్ప రెండు ఎకరాల విస్తీర్ణంలో పత్తిపంటను సాగుచేశాడు. పంటకు చీడపీడలు ఆశించడంతో గత ఆదివారం క్రిమిసంహారక మందును పిచికారీ చేశాడు. ఈక్రమంలో విష ప్రభావానికి గురై తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి కుమార్తె ఉంది. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

నిమజ్జనోత్సవానికి సిద్ధం

గుడ్డం కోనేరు వద్ద ఏర్పాట్లు

మునుపెన్నడూ లేనంత భద్రత

పురానికి సీమ జిల్లాల పోలీసులు

హిందూపురం, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నవరాత్రులు పూజలందుకున్న ఏకదంతుడు గురువారం గంగమ్మ ఒడికి చేరనున్నాడు. నిమజ్జనోత్సవానికి మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, ఆర్ అండ్ బీ, పోలీసు శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సారి భారీ విగ్రహాలే 30 నుంచి 40 దాకా ఉన్నాయి. మొత్తంగా 150కి పైగా విగ్రహాలు ఉన్నాయి. పెద్ద విగ్రహాలను వాహనంలోకి చేరిస్తే 30 అడుగులకుపైగా ఎత్తు వస్తాయి. వీటిని తరలించే సమయంలో ఇబ్బంది తలెత్తకుండా రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలను కత్తిరించారు. వినాయక ప్రతిమలను గుడ్డం కోనేరులో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. తెలుగు చేనేత శిక్షణా కేంద్రం నుంచి గుడ్డం రంగనాథస్వామి ఆలయం వరకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. వెలుతురు ఉండేలా భారీ లైట్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలిగినా, ఇబ్బంది లేకుండా జనరేటర్‌ను అందుబాటులో ఉంచారు. నిమజ్జనం కోసం భారీ క్రేన్‌లు అందుబాటులో ఉంచారు. కోనేరు వద్ద గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది ఉంటారు. పట్టణంలో ట్రాఫిక్ మళ్లింపు, నోపార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా 1300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐ, సిబ్బంది ఇప్పటికే పురం చేరుకున్నారు. అనంతపురం, చిత్తూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి పోలీస్ సిబ్బందిని రప్పించారు. పట్టణంలో బుధవారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు.

డ్రోన్ కెమెరాల నిఘా

గతంలో నిమజ్జనం రోజున జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకుని పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాలైన హస్నాబాద్, ఆర్టీసీ కాలనీ, ముక్కడిపేట, సీపీఐ కాలనీ, రహమత్‌పురం, నింకంపల్లి తదితర ప్రాంతాల్లో విగ్రహాల వద్ద పోలీసులు డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. డ్రోన్ కెమెరాలు చిత్రీకరించే దృశ్యాలను లైవ్ ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి పోలీసు అధికారులు పరిశీలించి, పర్యవేక్షించనున్నారు. ఎక్కడైనా ఇబ్బంది తలెత్తితే వెంటనే స్పందించేందుకు సిద్ధమయ్యారు. మిలాద్ ఉన్ నబి పండగ శుక్రవారం ఉన్నందున, ఆ రోజు ఉదయానికి నిమజ్జనం పూర్తి అయ్యేలా చూడాలని పోలీసులు శ్రమిస్తున్నారు. ప్రతి విగ్రహానికి ఇద్దరు కానిస్టేబుళ్లు, ప్రతి రెండు విగ్రహాలకు ఓ హెడ్‌కానిస్టేబుల్, మూడు విగ్రహాలకు ఓ ఏఎస్ఐ, నాలుగు విగ్రహాలకు ఒక ఎస్ఐ, ఐదు విగ్రహాలకు ఓ సీఐ ప్రకారం బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుకున్న సమయానికి నిమజ్జనం పూర్తి చేయాలని, విగ్రహ కమిటీల నిర్వాహకులు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

దాదాభాయ్ నౌరోజి (జయంతి)



'గ్రాండ్ ఓల్డ్‌మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన తొలి ఆసియా వ్యక్తి దాదాభాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4న జన్మించారు. పార్సీ మతానికి చెందిన విద్యావేత్త, మేధావి, పత్తి వ్యాపారి, తొలితరం రాజకీయ, సామాజిక నాయకుడు. 1892 నుంచి 1895 వరకు పార్లమెంట్ సభ్యుడిగా యునైటెడ్ కింగ్‌డమ్ హౌస్ ఆఫ్ కామన్స్‌లో కొనసాగారు. 'స్వరాజ్య' అనే పదం తొలిసారిగా వాడింది ఆయనే. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులలో ఒకరు. బాలగంగాధర్ తిలక్, గోపాలకృష్ణ గోఖలేలకు రాజకీయ గురువు. తొలితరం పారిశ్రామికవేత్త జేఆర్‌డీ టాటా లాంటి వారికి మార్గదర్శి. 1917 జూన్ 30న కన్నుమూశారు. 1963, 1997, 2017లలో పోస్టల్‌శాఖ ప్రత్యేకస్టాంపులు విడుదల చేసింది.

రిషికపూర్ (జయంతి)



ప్రముఖ హిందీ సినిమా నటుడు, దర్శకుడు రిషికపూర్ 1952 సెప్టెంబరు 4న ముంబైలోని చెంబూర్ ప్రాంతంలో జన్మించారు. తండ్రి రాజ్‌కపూర్ దర్శకత్వంలో 1970లో తీసిన 'మేరా నామ్ జోకర్' చిత్రంతో బాలనటుడిగా సినీరంగ ప్రవేశం చేశారు. ఈయన నటించిన పాత్రకు ఉత్తమ కళాకారుడిగా జాతీయ చలనచిత్ర పురస్కారం దక్కింది. డింపుల్ కపాడియాతో కలసి 'బాబీ' సినిమాలో యువ ప్రేమికుడిగా నటించారు. నటి నీతూ సింగ్‌ను పెళ్లాడారు. 50 ఏళ్లలో పదుల సంఖ్యలో సినిమాలలో నటించి నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2020 ఏప్రిల్ 30న కన్నుమూశారు.

మోహన్ కందా (పుట్టినరోజు)



మోహన్ కందా 1945 సెప్టెంబరు 4న చెన్నైలో జన్మించారు. ఐఏఎస్ అధికారిగా ప్రభుత్వంలో పలు కీలకమైన పదవులు చేపట్టినవారిగా పేరొందారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. జాయింట్ కలెక్టర్ స్థాయి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి వరకూ వివిధ హోదాల్లో పని చేశారు. జాతీయ విపత్తుల నిర్వహణా అథారిటీ (ఎన్‌డీఎంఏ) ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. కాగా కొన్ని సినిమాలలో మాస్టర్ మోహన్‌గా బాల నటుడిగా నటించారు. పలు పుస్తకాలు రాశారు. కోనసీమ రైతులు పంట విరామం ప్రకటించినప్పుడు రైతుల సమస్యలపై అధ్యయనంకై ఏర్పాటైన కమిటీకి అధ్యక్షత వహించారు.

అనంత్‌నాగ్ (పుట్టినరోజు)



పద్మభూషణ్ గ్రహీత ప్రముఖ నటుడు అనంత్‌నాగ్ 1948 సెప్టెంబరు 4న ఉత్తరకన్నడ జిల్లా శిరాలి ప్రాంతంలో జన్మించారు. నాటకం, వెండితెర, బుల్లితెరపైనా రాణించారు. కన్నడలో 200కుపైగా, తెలుగు, మరాఠీ, తమిళ, మళయాళం, హిందీ భాషల సినిమాల్లో కలిపి 300కుపైగా సినిమాల్లో నటించారు. ఐదు కర్ణాటక స్టేట్ ఫిల్మ్ అవార్డులు, 6 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. ఆర్‌కె నారాయణ్ రచించిన మాల్గుడి డేస్‌లో సోదరుడు శంకర్‌నాగ్ దర్శకత్వంలో బుల్లితెరపై నటించి రాణించారు.

సాహిత్యం, సైన్స్ నాణేనికి రెండు ముఖాలు

● ఆచార్య రామకృష్ణారెడ్డి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాహిత్యం, సైన్స్ భిన్నాంశాలు కావనీ, ఒక నాణేనికి రెండు ముఖాలు అని ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల వాణిజ్య శాఖ సమావేశ మందిరంలో ఆంధ్రభారతి తెలుగుశాఖ ఆధ్వర్యంలో బుధవారం 'డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ సాహిత్యంలో వైవిధ్యం' అనే అంశంపై సాహితీ సమాలోచన నిర్వహించారు. కార్యక్రమంలో ఆచార్య రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వేణుగోపాల్ సాహిత్యంలో జరిగిన పరిశోధనలు భావితరం రచయితలు తమ రచనలకు మెరుగులు దిద్దేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. సాహిత్యం సమాజానికి చూపు వంటిదనీ, సైన్స్ ఆలోచన వంటిదని విశ్లేషించారు. నాగసూరి వేణుగోపాల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అనీ, ఆలిండియా రేడియో డైరెక్టర్‌గా, సాహితీ పరిశోధకుడిగా అనేక పాత్రలను నిర్వర్తించారన్నారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ... సాహిత్యం, సైన్స్ సామాజిక పురోభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు.

జన మాధ్యమాల్లో తెలుగు భాష భిన్న రూపాలను సంతరించుకుంటున్న తీరును నాగసూరి వేణుగోపాల్ గుర్తించి నిర్దిష్టంగా విశ్లేషించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు అంకె శ్రీనివాసులు, తూముచెర్ల రాజారాం, డాక్టర్ హేమమాలిని, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, తాళంకి జీవన్‌కుమార్, డాక్టర్ జీఎల్‌ఎన్ ప్రసాద్, అధ్యాపకులు మాదవీలత, డాక్టర్ నాగేశ్వర్‌నాయుడు, అంకె మదన్‌మోహన్ పాల్గొన్నారు.



సాహితీ సమాలోచనలో మాట్లాడుతున్న ఆచార్య రామకృష్ణారెడ్డి

పట్టు విద్యార్థుల వనమహోత్సవం



మొక్కలతో విద్యార్థుల బృందం, గ్రామస్థులు

చింతామణి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కురుబూరు పట్టు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఫైనలియర్ విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామీణ కృషి అనుభవ శిబిరంలో భాగంగా నాయింద్రహళ్లిలో పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం ఆవరణలో వనమహోత్సవం, సమాచార కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. పట్టు వర్సిటీ చింతామణి డీన్ వెంకటరమణ, పట్టు కళాశాల కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, కో-కన్వీనర్ డాక్టర్ వీపీ భారతి తదితరులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. భూసార పరీక్షలు, విత్తన శుద్ధి, సేంద్రియసాగు, పట్టు సాగు, కీటకాలు, రోగాలు, తేనెటీగల పెంపకం, అర్థశాస్త్రం, పశువుల పెంపకం, బయో ఇంధనం, పంటలపై అధ్యయనం గురించి విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. అనంతరం పాఠశాల సమీ పాన మొక్కలు నాటి వనమహోత్సవం ఆచరించారు. అటవీశాఖ విభాగం డాక్టర్ సంజీవ్ క్యాతప్పనవర్ కార్యక్రమ ప్రాధాన్యతను తెలియచేశారు. గ్రామస్తుల పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రొధ్యాపకులు వెంకటేశ్, పట్టువిభాగం సహాయక డైరెక్టర్ అక్మల్‌పాషా, గ్రామపంచాయతీ సభ్యులు, పాల ఉత్పత్తిదారుల సహకారసంఘం అధ్యక్షుడు రమేశ్, గ్రామ ప్రముఖుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బెంగళూరు టీడీపీ ఫోరం వార్షికోత్సవం

» అభినందించిన మంత్రి నారా లోకేశ్

బెంగళూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, వ్యాపార రీత్యా బెంగళూరులో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్ జిల్లాల యువత ఏర్పాటు చేసుకున్న బెంగళూరు టీడీపీ ఫోరం (బీటీఎఫ్) 12వ వార్షికోత్సవాలను బుధవారం వైట్‌ఫీల్డ్ మున్నేకొళ్లాలలోని కన్వెన్షన్ హాల్‌లో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బీటీఎఫ్ ముఖ్యులు కేక్ కట్ చేసి కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా గడిపారు. పన్నెండేళ్ల బీటీఎఫ్ కాలంలో ఎన్నో కార్యక్రమాలను చేపట్టినట్టు ముఖ్యులు శ్రీకాంత్ తెలిపారు. ఏటా సంక్రాంతి సంబరాలను తెలుగు సంప్రదాయాలతో నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాలను డిజిటల్ రూపంలో పోరాటం చేశామన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును నైపుణ్యాభివృద్ధి సంస్థలో అవినీతి జరిగిందని ఓ అక్రమ కేసు నమోదు చేసి అరెస్టు చేసినప్పుడు బెంగళూరులో బీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరంతరంగా నిరసనలు కొనసాగించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కంటే ఎక్కువస్థాయిలో వినూత్నమైన నిరసనలు కొనసాగింది కర్ణాటక వ్యాప్తంగా అన్నారు. ప్రపంచదేశాలలో చంద్రబాబుకు మద్దతు ఇచ్చేందుకు బెంగళూరులో జరిగిన పోరాటాలు ఓ స్ఫూర్తిగా అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికోసం బీటీఎఫ్ నిరంతరంగా పనిచేస్తోందన్నారు. బీటీఎఫ్ పన్నెండు వసంతాల వేడుకపై మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా అభినందించారన్నారు.



సంబరాల్లో అభిమానులు, కార్యకర్తలు

దళారులకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం



సమావేశంలో ప్రముఖులకు సన్మానం

శిడ్లఘట్ట, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ కల్పించడంతోపాటు దళారులకు అడ్డకట్ట వేయడమే లక్ష్యమని డీఆర్‌డీఏ యోజనా ప్రాధికార అతీక్‌పాషా అభిప్రాయపడ్డారు. తాలూకాలోని బెళ్ళూటి గేట్ గుట్టాంజనేయస్వామి కల్యాణమండపంలో భారతాంబె మహిళా కిసాన్ ఉత్పత్తిదారుల కంపెనీ వార్షిక మహాసభ సమావేశం జరిగింది. నైపుణ్యాభివృద్ధిశాఖ, గ్రామీణ జీవనోపాధాయ సంవర్ధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటైంది. అతీక్‌పాషా మాట్లాడుతూ ఇటీవలి కాలంలో రసాయన ఎరువులు, విత్తనాలు సహా అన్ని ధరలు పెరిగాయని అయితే అందుకు తగినంతగా రైతులకు ధర లభించడం లేదన్నారు. షేర్‌హోల్డర్లు అయిన రైతులకు అవసరమైన పరికరాలను రాయితీ ధరలతో అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కంపెనీ అధ్యక్షురాలు ఆశా మాట్లాడుతూ పంటలను కాపాడుకునేందుకు టార్పాలిన్‌ల అవసరం పెరిగిందన్నారు. కార్యక్రమంలో విజయకుమార్, నస్రీన్‌తాజ్, మాలాశ్రీ, చైత్ర, మేలూరు ప్రభ, మళ్ళూరు మంజుళ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ టీచర్లుగా ముగ్గురి ఎంపిక





ఉపాధ్యాయులు ఆనందప్ప, ఫైజుల్లా, లక్ష్మీదేవమ్మ

ముళబాగిలు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 2025-26 సంవత్సరానికి కోలారు జిల్లా అత్యుత్తమ పురస్కారాల జాబితా విద్యాశాఖ ప్రకటించింది. ముళబాగిలు తాలూకా ప్రభుత్వ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ ఎం ఆనందప్ప, ముళబాగిలు పట్టణం కురుబరపేట మెయిన్ ప్రభుత్వ ఉర్దూ ప్రాథమికోన్నత స్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎం ఫైజుల్లా, గుమ్లాపుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్కూల్ అసిస్టెంట్ లక్ష్మీదేవమ్మలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారానికి ఎంపికయ్యారు. తాలూకా ఎంపిక కమిటీ సిఫారసు మేరకు జిల్లా ఎంపిక సమితి వీరి పేర్లను ఖరారు చేసింది. ఈనెల 5న జిల్లా కేంద్రమైన కోలారు పట్టణం టీ చన్నయ్యరంగమందిరంలో ఉపాధ్యాయుల దినోత్సవంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. స్కూల్‌లో పాఠాలతోపాటు అడ్మిషన్లకోసం కృషి చేసినవారికి, డ్రాప్ అవుట్‌లను తిరిగి పాఠశాలకు రప్పించడం, స్వయం సేవాసంస్థలనుంచి పాఠశాల అభివృద్ధికి శ్రమించడం తదితర అంశాలను పరిగణనలోకి ఎంపిక చేశారు.

గుంతలరోడ్లను బాగుచేయండి

దొమ్మసంద్ర, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆనేకల్ తాలూకా దొమ్మసంద్ర సర్కిల్‌లో రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. సరిహద్దులోని తమిళనాడునుంచి వచ్చే వాహనాలకు హొసకోటె, దేవనహళ్ళి, హైదరాబాద్, ముంబై నగరాలకు వెళ్లే లింక్‌రోడ్డుగా ఉందన్నారు. కాగా స్థానికంగా ఐటీబీటీ ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు బీఎంటీసీ బస్సులతోపాటు ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లలో రాకపోకలు సాగిస్తుంటారు. కేఆర్‌ఎస్ పార్టీ ఆనేకల్ ప్రధాన కార్యదర్శి హరీశ్‌కుమార్ మాట్లాడుతూ దొమ్మసంద్ర సర్కిల్ బ్రిడ్జ్ నిర్మాణానికి పదేళ్లక్రితం భూమిపూజ చేశారని, సుమారు 19కోట్లు అంచనాగా ప్రకటించారన్నారు. అయితే ఇంతవరకు నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో తరచూ ట్రాఫిక్‌జామ్ సమస్య ఉందని, పలువురి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. బీజేపీ నాయకుడు భరత్‌గౌడ మాట్లాడుతూ ఈ మార్గంలో ఎక్కువగా టిప్పర్ లారీలు రాకపోకలు సాగిస్తుంటాయని, నిర్ణీత బరువుకు మించి ఎక్కువ టన్నుల రవాణా కారణంగా రోడ్లు త్వరగా దెబ్బతింటున్నాయన్నారు. ఆర్టీఓ, ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేశారు. గ్రామాల రోడ్లకంటే రాష్ట్ర, జాతీయ రహదారులపై గుంతలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సర్జాపుర నుంచి విధానసౌధ చేరేందుకు సుమారు మూడు గంటల సమయం పడుతోందని, ఇందుకు రోడ్ల దుస్థితి కారణం ఒకటైతే ట్రాఫిక్ జామ్ మరొకటని పలువురు అభిప్రాయపడ్డారు. గుంతల రోడ్లపై వాహనాలు అదుపు తప్పి తరచూ ఎవరో ఒకరు గాయపడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. కేఆర్‌డీసీఎల్, పీడబ్ల్యూడీ అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



గుంతలమయమైన రహదారిపై వాహనాల సంచారం



కంకర తేలడంతో సగం మట్టిరోడ్డుగా మారినవైనం

మహిళా హక్కుల సాధనకు ఏకమవుదాం

● ఐద్వా జాతీయ నేత పుణ్యవతి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): హక్కులను సాధించుకునేందుకు మహిళలు ఏకమవుదామని ఐద్వా జాతీయ నేత పుణ్యవతి పిలుపునిచ్చారు. స్థానిక లలితకళాపరిషత్ మినీ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఐద్వా జిల్లా మహాసభకు పుణ్యవతి హాజరయ్యారు. తొలుత పతాకాన్ని ఆవిష్కరించి, అరుణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పుణ్యవతి మట్లాడుతూ.. మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆగడాలకు అధికంగా మహిళలే బాధితులు అవుతున్నారన్నారు. వెంటనే రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. మద్యం, మత్తు పదార్థాల వినియోగం వల్ల ఇళ్లలో మహిళలు హింస అనుభవిస్తున్నారన్నారు. సరైన పౌష్టికాహారం లేక రక్తహీనతతో ఎక్కువ మంది స్త్రీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్త్రీలు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు పట్టనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మహిళలు హక్కుల సాధనకు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ... అక్టోబరు 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో ఐద్వా రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ఐద్వా జిల్లా నాయకురాలు చంద్రకళ భవిష్యత్ కార్యాచరణ నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నేత డాక్టర్ ప్రసూన పాల్గొన్నారు.



అరుణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఐద్వా నేతలు

జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఐద్వా మహాసభలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షురాలిగా శ్యామల, ప్రధాన కార్యదర్శిగా చంద్రిక, కోశాధికారిగా అశ్విని, కార్యదర్శులుగా శంషాద్, రామాంజినమ్మ, సుజాత, గీత, శైలజ, రేణుక, రంగమ్మ, కృష్ణవేణి, లక్ష్మీదేవి, నడిపక్కను ఎన్నుకున్నారు.

ఎంటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల పరిధిలో ఆగస్టులో నిర్వహించిన ఎంటెక్ ఒకటి, రెండో సెమిస్టర్ ఫలితాలను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి విడుదల చేశారు. ఫలితాలు కళాశాల అకడమిక్ సెక్షన్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య వసుంధర, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య మాధవి, డాక్టర్ లలితకుమారి, జరీనా, హెచ్‌ఓడీ ఆచార్య భువన విజయ, ఆచార్య కేఎఫ్ భారతి, ఆచార్య నారాయణరెడ్డి, కల్యాణ్‌కుమార్, చంద్రమోహన్ రెడ్డి, కల్యాణిరాధ, అజిత పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

భారత జట్టుకు ఆడాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్ ● ఏసీఏ క్రికెట్ టోర్నీ ప్రారంభం



టాస్‌వేసి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): భారత జట్టుకు ఆడాలని క్రికెటర్లకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నేషనల్ ఇన్విటేషనల్ అండర్-19 క్రికెట్ టోర్నీని కలెక్టర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రికెటర్లు అవకాశాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. యువత దురలవాట్లకు దూరంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి, ఏసీఏ జూనియర్ జట్టు సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ అచ్యుతరావు, సెలెక్టర్ లీలా మోహన్‌రెడ్డి, సభ్యులు షబ్బీర్‌అహ్మద్, రంజీ మాజీ ప్లేయర్ సురేష్, మచ్చా రామలింగారెడ్డి, ప్రసన్న, విజయ్‌కుమార్, మహ్మద్ రఫీ, సర్దార్, శ్రీనివాసరెడ్డి, కమలాకర్ నాయుడు పాల్గొన్నారు.

ఏసీఏ సెక్రటరీ, బరోడా జట్ల బోణీ



ఈశ్వర్ రితిక్



విశ్వాస్ పటేల్



వీరారెడ్డి

తొలిరోజు పోటీల్లో ఏసీఏ సెక్రటరీ లెవెన్, బరోడా జట్లు బోణీ చేశాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో ఏసీఏ సెక్రటరీ లెవెన్, మధ్యప్రదేశ్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ సెక్రటరీ జట్టు 40.4 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌటైంది. ఈశ్వర్ రితిక్ (78), సిద్దు కార్తీక్‌రెడ్డి (67) హాఫ్ సెంచరీలతో రాణించారు. అనంతరం బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ 48.1 ఓవర్లలో 217 పరుగులకే ఆలౌటైంది. అర్వన్ శర్మా (74) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఏసీఏ సెక్రటరీ జట్టు 12పరుగుల తేడాతో గెలుపొందింది. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో బరోడా, ఏసీఏ ప్రెసిడెంట్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ ప్రెసిడెంట్ జట్టు 46.5 ఓవర్లలో 235 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ వీరారెడ్డి (68బంతుల్లో 9 బౌండరీలు, 5 సిక్సర్లతో 97) చెలరేగాడు. 3 పరుగులతో సెంచరీ చేజార్చుకున్నాడు. అనంతరం బరిలోకి దిగిన బరోడా జట్టు 38.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసింది. విశ్వాస్ పటేల్ సెంచరీ (105)తో చెలరేగి జట్టుకు 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందించాడు.

ఏఆర్టీని సర్వసిద్ధంగా ఉంచాలి

● డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా



ఏఆర్టీలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

గుంతకల్లు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైల్వే ప్రమాదాలు జరిగినపుడు ఉపయోగపడే యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ (ఏఆర్టీ)ని ఏ సమయంలోనైనా బయలుదేరే విధంగా సర్వసన్నద్ధంగా ఉంచాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లోని సీఅండ్‌డబ్ల్యూ స్టోర్ వద్ద ఉన్న యార్డులో ఏఆర్టీని బుధవారం డీఆర్‌ఎం తనిఖీ చేశారు. ఏఆర్టీ సిబ్బందితో మాట్లాడుతూ... రైలు ప్రమాదాలు జరిగినపుడు అత్యవసరంగా ఘటనా స్థలానికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. తక్షణ వైద్య సహాయం, పునరుద్ధరణ సేవలను సత్వరం అందించాల్సి ఉంటుందన్నారు. ఆ దిశగా ఏఆర్టీలో అవసరమైన కిట్లు, వైద్య పరికరాలను ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలన్నారు.

1922.75 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 1922.75 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ పేర్కొన్నారు. స్థానిక ప్రయన్నాయపల్లి రైల్వే స్టేషన్ వద్ద రైల్వే వ్యాగిన్ ద్వారా వచ్చిన ఎరువుల ర్యాక్‌ను బుధవారం ఏడీఏ పరిశీలించారు. ఇందులో యూరియా 904.5 మెట్రిక్ టన్నులు, డీఏపీ 507.85, 20-20-0-13 రకం 255.2.., 10-26-26 రకం 255.2 మెట్రిక్ టన్నులు సఫరా అయ్యాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు వీటిని ఏపీ మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు కేటాయించామన్నారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు.



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.64	1,631.38
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	47.200	29,907
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	45,179	15,264
నీటి నిల్వ (టీఎంసీలు)	78.60	99.35

పుణ్యారాధన నిర్వహించవద్దు

కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బళ్లారి తాలూకాలోని కొళగల్లు గ్రామంలో సెప్టెంబరు 13 వరకు నిర్వహించాలని భావించిన సద్గురు ఎర్రితాత 111వ పుణ్యారాధన కార్యక్రమాలను నిర్వహించరాదని కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. బళ్లారి గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొళగల్లు గ్రామంలో ఎర్రితాత ఆలయ పరిపాలన ఆస్తులకు సంబంధించి వివాదాలు నెలకొన్న నేపథ్యంలో శాంతి భద్రతలకు దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

గట్టుకు చేరిన మోటార్లు



ధ్వంసమైన మోటార్లు

కంప్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పొలాల్లో రైతులు అమర్చుకున్న మోటార్లు గట్టుకు చేరాయి. నదికి నీరు ఎక్కువగా పోటెత్తడంతో మోటార్లను రైతులు గట్టుకు చేర్చారు. రైతు రమణయ్య మాట్లాడుతూ ఈ యేడాదిలో నది అధికమైనందున ఇబ్బందులు ఎక్కువయ్యాయన్నారు. పొలాల్లో వరి పంటకు ఇప్పటికీ వైరస్‌లు సోకి ఎన్నో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనికితోడు ఎక్కువగా వర్షాలు కురవడం, నదికి నీరు పోటెత్తడంతో మోటార్లు ధ్వంసమవుతున్నాయన్నారు.

నేటి నుంచి దసరా క్రీడలు

యువజన క్రీడాశాఖ అధికారి గ్రేసీ



సిరుగుప్ప, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నేడు దసరా క్రీడలు నిర్వహిస్తున్నట్లు యువజన క్రీడాశాఖ అధికారి గ్రేసీ తెలిపారు. గురువారం హైస్కూలు గ్రౌండ్‌లో ఎమ్మెల్యే బీఎం నాగరాజ ఈ క్రీడలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తాలూకావ్యాప్తంగా వున్న యువతీ యువకులు, మహిళలు పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ప్రతి యేడాది దసరాను పురస్కరించుకుని ఈ క్రీడలను జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరిక



పార్టీలో చేరిన వారితో నారా భరత్‌రెడ్డి

బళ్లారి రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని 17వ వార్డు సమీపంలో వార్డు ప్రముఖులు వన్నూరప్ప ఆయన కుమారులు సతీష్, సచిన్, సోమశేఖర్, రిటైర్డ్ తహసీల్దార్ రంగమ్మ, శివమూర్తి, యోగేంద్ర రెడ్డి, అవినాష్, కార్తీక్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నగరంలో పార్టీ కార్యాలయంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అల్లం ప్రశాంత్ సిటీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బోయపాటి విష్ణువర్దన్, స్థానిక వార్డు కార్పొరేటర్ కవిత వన్నప్ప నేతృత్వంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరానికి 6న వచన సంస్కృతి

సిరిగేరి పన్నరాజ్



మాట్లాడుతున్న సిరిగేరి పన్నరాజ్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): శరణ, వచన సంస్కృతి గురించి నేటి ప్రజలకు తెలియజేయడానికి గ్లోబల్ లింగాయత్ మహాసభ నిర్వహిస్తున్న వచన సంస్కృతి సెప్టెంబరు 6న నగరానికి చేరుకుంటుందని బసవ సంస్కృతి ప్రచార సమన్వయకర్త సిరిగేరి పన్నరాజ్ తెలిపారు. నగరంలోని పత్రికాభవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచన సాహిత్యాన్ని సంరక్షించడం, వ్యాప్తిచేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. లింగాయత్ మఠాధిపతుల సంఘం, బసవలింగ పట్టదదేవరు హిరేమఠ్ సంస్థాన్ బాల్కి, జగద్గురు తొంటదార్య సంస్థాన్ మఠం, గదగ్‌లోని తొంట సిద్దరామస్వాములు మొదలైన వారి సమక్షంలో ఈ ప్రచార కార్యక్రమం సెప్టెంబరు 1న బీజాపూర్ జిల్లాలోని బాగేవాడి నుంచి ప్రారంభమైందన్నారు. సెప్టెంబరు 6న బళ్లారికి చేరుకుంటుందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి అక్టోబరు 5న బెంగళూరు ప్యాలెస్ గ్రౌండులో ముగుస్తుందన్నారు. రథానికి ఉదయం 9 గంటలకు కే.ఆర్. ఎస్ ఫంక్షన్ హాల్ సమీపంలో స్వాగతం పలకనున్నామని, అక్కడి నుంచి ఊరేగింపు నిర్వహణ ఉంటుందన్నారు. బసవేశ్వర, దుర్గమ్మ గుడి సర్కిల్, అండర్ బ్రిడ్జ్, గడగి చెన్నప్ప సర్కిల్, బెంగళూరు రోడ్డు, బ్రూస్‌పేట సర్కిల్, తేరువీధి మీదుగా గవియప్ప సర్కిల్ వద్ద బసవేశ్వర విగ్రహం వద్దకు చేరుకుంటుందని, అక్కడ బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పార్వతీనగర్ మెయిన్ రోడ్డు మీదుగా కప్పగల్లు రోడ్డులోని కిత్తూరు రాణి చెన్నమ్మ పాఠశాల ఆవరణకు చేరుకోవడంతో ర్యాలీ ముగుస్తుందన్నారు. ఉదయం 10 గంటలకు అల్లం సుమంగళమ్మ కళాశాలలో విద్యలో వచన సాహిత్యం పాత్ర అనే అంశంపై ఉపన్యాసం ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు కిత్తూరు రాణి చెన్నమ్మ పాఠశాల నుంచి వందలాది మంది ప్రజాసంఘాలు, జానపద వాయిద్యాలతో దుర్గమ్మ దేవాలయం మీదుగా బసవ భవన్ వరకు ప్రచార యాత్ర ఉంటుందన్నారు. సమావేశంలో ప్రచార సంఘం జిల్లా ప్రధాన అధికారి బసవరాజప్ప, సంగనకల్లు హేమతరాజ్, జానెకుంట నేపాక్షప్ప, బాగేవాడి యోగిరాజ్, నీలనగౌడ్, డాక్టర్ శంకర్ జీరంకలి, మీనళ్లి చంద్రశేఖర్ చంద్రమౌళి, గంగావతి వీరేశ్, సరేశ్ ,రవిశంకర్, శరణబసవ తిమ్మనగౌడ, మల్లికార్జునగౌడ తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేయాలి

జిల్లా పంచాయతీ సీఈఓ మహ్మద్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తీవ్రమైన పోషకాహారలోపంతో బాధపడుతున్న చిన్నారులకు సంబంధించి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మహ్మద్ హారీస్ సూచించారు. నగరంలోని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి కార్యాలయంలో పోషకాహార లోపం ఉన్న పిల్లల ఆరోగ్య పరీక్షలకు సంబంధించి వైద్య అధికారులతో జరిగిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. న్యూట్రిషన్ ట్రాకర్ ద్వారా పిల్లల ఎత్తు, బరువును పర్యవేక్షించాలని ఆదేశించారు. తీవ్రమైన పోషకాహార లోపం ఉన్న పిల్లలు కనిపిస్తే తగిన చికిత్సతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీనివల్ల పిల్లలు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. తనిఖీ సమయంలో ఆ ప్రాంతానికి సంబంధించిన ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వ్యక్తిగతంగా హాజరై కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. ఇక గర్భిణులకు సంబంధించి ప్రతిఒక్కరికీ చెకప్ చేయాలన్నారు. రక్తహీనత, రక్తపోటు తదితర విషయాలపై శ్రద్ధవహించాలన్నారు. గర్భిణులు ఐరన్ మాత్రలు తీసుకుంటున్నారా లేదా అనే అంశంపై ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద వైద్య అధికారులు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి కార్డుల్లో నమోదు చేయాలన్నారు. వైద్య అధికారులతో సమావేశం నిర్వహించి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య కుటుంబసంక్షేమ అధికారి రమేష్‌బాబు, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్ హనుమంతప్ప పాల్గొన్నారు.

ఇనుప చక్రాలతో రోడ్డుపై ప్రయాణమా..?

రోడ్లు దెబ్బతింటున్నాయంటూ ఎమ్మెల్యే గణేష్ ఆగ్రహం



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నూతనంగా నిర్మించిన రోడ్లపై ఇనుప చక్రాలు వేయవద్దని ఎమ్మెల్యే గణేష్ సూచించారు. బుధవారం దేవలాపురం, జవుకు గ్రామంలో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన రోడ్లు వేసి నెలలు కాకముందే పూర్తిగా ధ్వంసం అవుతున్నాయన్నారు. రైతులు పొలాల్లో సేద్యం చేసే సమయంలో ఇనుప చక్రాలను ఇంటి నుంచి పొలం వరకు వేసుకుని పోతుండటంతో రోడ్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయన్నారు. మంత్రులతో చర్చించి రోడ్లకు నిధులు సమకూర్చడం జరిగిందని, నూతన రోడ్లు నిర్మిస్తే ఇలానే వ్యవహరించేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కురుగోడు పరిధిలో ఇనుప చక్రాలు వేసుకుని పొలంలో వెళ్లే వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారన్నారు. కంప్లి, కుడితిని, మోకా పోలీస్ స్టేషన్ల పరిధిలోని నూతన రోడ్లపై ఇనుప చక్రాలు వేయకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మేరకు అన్ని పథకాలు కల్పించి మాట నిలబెట్టుకుందన్నారు. ప్రతిపక్ష నాయకులు ఈ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బసవరాజు, తిమ్మారెడ్డి, సోమప్ప, పంపాపతి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వర్షాలకు తడిసిన పంటలు

రైతులకు తప్పని తిప్పలు



దేవలాపురం వద్ద మొక్కజొన్నను ఆరబోస్తున్న రైతు



దేవసముద్రం క్రాస్ వద్ద తడిసిన సజ్జ పంటను ఆరబోస్తున్న రైతు

కంప్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): రెండు మూడు రోజులుగా కురిసిన వర్షానికి సజ్జ, మొక్కజొన్న పంటలు నీటిలో తడిసాయి. చేతికొచ్చిన పంటలు నీటిపాలు కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కంప్లి తాలూకా పరిధిలోని దేవసముద్రం మెట్రి, దేవలాపురం తదితర గ్రామాల్లో వేసుకున్న సజ్జ, మొక్కజొన్న పంటలు వర్షానికి పూర్తిగా దెబ్బతిన్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకుంటూ ఇబ్బందులు పడుతున్నామన్నారు. రైతు అమరేష్ మాట్లాడుతూ పంటలు తీసుకుని రేపో మాపో నూనుపు చేసి మార్కెట్‌కు తరలించాలని అనుకున్నామని, అయితే వర్షం దెబ్బకి పూర్తిగా తడిసిపోయి పండిన పంట దెబ్బతిందన్నారు.

వర్గీకరణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

పోరాట సమితి నాయకుడు రవీంద్ర జల్దార్

రాయచూరు సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను న్యాయబద్ధం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని దళిత సంఘాల ఐక్య వేదిక పోరాట సమితి నాయకుడు రవీంద్ర జల్దార్ అన్నారు. ఈ విషయంలో గందరగోళాన్ని నివారించి మాదిగ ఉప కులాలకు న్యాయం చేయకపోతే ప్రత్యేక్ష పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. బుధవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షల రూపాయిలు వ్యయం చేసి న్యాయమూర్తి నాగమోహన్ దాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ ఇచ్చిన నివేదికను సక్రమంగా అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిందన్నారు. ఒత్తిడికి గురై కొన్ని వర్గాలకు మాత్రమే న్యాయం చేసేలా రిజర్వేషన్‌లను రూపొందించిందన్నారు. అత్యంత వెనకబడిన 59 ఎస్సీ ఉప కులాలను గ్రూప్ 1 నుంచి గ్రూప్ 3లో చేర్చడం ద్వారా వారికి అన్యాయం జరగనుందన్నారు. దీంతోపాటు రాష్ట్రప్రభుత్వం రూపొందించిన రిజర్వేషన్‌లలో అనేక లోపాలున్నాయని వాటిని సవరించి తగిన న్యాయం చేయకపోతే తాము ప్రత్యక్ష ఆందోళనకు దిగడం ఖాయమన్నారు.

జోతిష్యం పేరుతో మోసం

డ్రైవర్, మరో నలుగురి అరెస్టు



పోలీసు స్టేషన్‌లో సాధువుల వేషధారణలో నిందితులు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ తాలూకా చిక్కగొండనహళ్ళి వద్ద ఓ రైతుకు జోతిష్యం చెబుతూ అతడి చేతికి ఉన్న ఉంగరాన్ని దొంగలించి పరారైన నలుగురిని, ఒక డ్రైవర్‌ను తురువనూరు పోలీసులు అరెస్టు చేశారు. ఐదుగురు సాధువుల వేషధారణలో ప్రజలను మోసం చేస్తున్నట్లు సమాచారం అందడంతో చిత్రదుర్గ తాలూకా చిక్కగొండనహళ్లి పోలీసులు ఈ ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. కమలనాథ్, సంతోష్ నాథ్, జైన్ సాథ్ చౌహాన్, శ్రవణ్ జోగి, డ్రైవర్ టోనియాలను అరెస్టు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. జాతీయ రహదారి 50 వద్ద రైతు రవికుమార్ రోడ్డు పక్కన నిలబడగా, కారులో కూర్చొన్న సాధువుల వేషంలో ఉన్న వారు రవికుమార్‌ను కారులో ఎక్కించుకుని జోతిష్యం చెప్పే నేపథ్యంలో రవికుమార్ వేలుకు ఉన్న ఉంగరాన్ని తీసి నోటిలో వేసుకున్నారు. అనంతరం రవికుమార్‌ను కారులో నుంచి కిందకు దించి పరారయ్యారు. తురువనూరు పోలీసు స్టేషన్‌లో రవికుమార్ ఫిర్యాదు చేశాడు. వెంటనే పోలీసులు సాధువుల వేషధారణలో ఉన్న నలుగురితోపాటు ఓ వాహనం డ్రైవర్‌ను అరెస్టు చేశారు. చిత్రదుర్గ జిల్లా ఆసుపత్రిలో నిందితులను వైద్యపరీక్షల నిర్వహించిన అనంతరం పోలీసులు కోర్టులో హాజరుపరిచారు.

విద్యుత్ శాఖ ఈఈ గాయత్రి హత్య

కారు డ్రైవర్‌ను అరెస్టు చేసిన పోలీసులు



గాయత్రి (ఫైల్)

రాయచూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ జెస్కాం విభాగంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా విధులు నిర్వహిస్తున్న గాయత్రి(52) హత్యకు గురయ్యారు. ఇటీవల ఈఈగా పదోన్నతి పొందిన గాయత్రి తన కార్యాలయానికి కారును వినియోగిస్తుండగా డ్రైవర్‌గా పని చేస్తున్న బసవరాజ్(33)ను నిందితుడిగా పోలీసులు అరెస్టు చేశారు. ఈఈ గాయత్రి తల్లి తిప్పమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. కాగా 2003 నుంచి ఆ శాఖలో ఏఈఈగా పనిచేస్తున్న గాయత్రి ఈఈగా ఉద్యోగోన్నతి పొందారు. కొన్నేళ్లుగా కారు డ్రైవర్‌గా బసవరాజ్.. ఆమె దగ్గర పని చేస్తున్నారు. ఈ క్రమంలో కొంతకాలంగా గాయత్రిని డబ్బులు, బంగారు కోసం డ్రైవర్ బసవరాజ్ వేధిస్తున్నట్లు గాయత్రి తల్లి తిప్పమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గాయత్రిని గొంతు నులిమి చంపి అనంతరం రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు నాటకం ఆడాడని, ఇదే క్రమంలో ఆమె సోదరి నందినికి ఫోన్ చేసి గుండెపోటుతో మరణించిందని చెప్పాడని తల్లి తిప్పమ్మ.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో బసవరాజ్‌ను అరెస్టు చేసి, కేసు నమోదు చేసిన వెస్ట్ పోలీసులు హత్యకు సంబంధించి పూర్తి వివరాల కోసం దర్యాప్తు ప్రారంభించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

బళ్లారి రూరల్, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ వార్డుల్లో అనేక అభివృద్ధి పనులకు బుధవారం సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి భూమిపూజ చేశారు. 20వ వార్డులో మారుతీ కాలనీలో రూ. 20 లక్షల నిధులతో అంగన్‌వాడీ కేంద్రానికి భూమి పూజ చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రూ. 80 లక్షల వ్యయంతో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖులు పేరం వివేక్, మాజీ మేయర్ రాజేశ్వరి, నాగమ్మ, నాయకులు సుబ్బరాయుడు, రాజు, రఘు, జబ్బార్, వన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

కాలువలో వ్యక్తి గల్లంతు



గాలింపు చర్యలు చేపడుతున్న సిబ్బంది

రాయచూరు సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా చిక్క ఉప్పేరి గ్రామం వద్ద వ్యక్తి నారాయణపూర్ కాలువలో గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన బంగి ఈరప్ప కాలువలో నీరు తాగేందుకు వెళ్లి కాలు జారి పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వెంటనే పోలీసులకు సమాచారం అగ్ని మాపక సిబ్బంది కాలువలో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం అన్వేషణ ప్రారంభించారు. బుధవారం మధ్యాహ్నం వరకు వ్యక్తి ఆచూకీ దొరకలేదని పోలీసులు అగ్నిమాపక అధికారులు తెలిపారు.



నిమజ్జనోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా నిమజ్జనం

కంప్లి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షుగర్ ఫ్యాక్టరీలో వినాయక మండలి ఆధ్వర్యంలో నిమజ్జనం వైభవంగా సాగింది. వినాయక ప్రతిమ ముందు యువత నృత్యములు చేస్తూ ముందుకు సాగారు. ఉదయం వినాయకుడి లడ్డు, పూలహారం, శాలువా వేలం వేశారు.

ఘనంగా పవన్ జన్మదిన వేడుకలు

సిరుగుప్ప, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సిరుగుప్ప పట్టణంలో ఆయన అభిమాన సంఘం అధ్యక్షులు మూర్తి పవన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వాస్పత్రి, వృద్ధాశ్రమం, ఆర్టీసీ బస్టాండులో వివిధ చోట్ల అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.




బ్రెడ్డు, పండ్లతో పవన్ అభిమానులు

హోసూరు జోన్

కెలవరపల్లి డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో

హోసూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు, డ్యాంకు ఎగువన సైతం కర్ణాటక ప్రాంతంలో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో పెరిగింది. మంగళవారం 867 క్యూసెక్కులు ఉండగా బుధవారం నాటికి 1076 క్యూసెక్కులకు పెరిగింది. కాగా తెన్‌పెన్నై నదిలో సరిహద్దులలోని ఫ్యాక్టరీల రసాయన వ్యర్థాలు కలుస్తుండడంతో నీరు కలుషితం అవుతోందని ప్రజలు, రైతులు నిరాశ చెందుతున్నారు. డ్యాం సామర్థ్యం 44.28 అడుగులు కాగా ప్రస్తుతం 41.82 అడుగులకు చేరింది. నీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

సీసీ కెమెరాలను బాగు చేయండి



హోసూరు బస్టాండు

హోసూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడలు అధికంగా ఉండే హోసూరుకు ప్రజల రాకపోకలు అధికంగా ఉంది. బస్టాండ్‌కు నిత్యం 50వేల మంది రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే హోసూరు ఆర్టీసీ బస్టాండ్‌లో భద్రతకోసం 72 సీసీ కెమెరాలు అమర్చారు. వీటిలో కొన్ని సాంకేతిక కారణాలతో పనిచేయడం లేదని తెలుస్తోంది. గతంలో చోటు చేసుకున్న నేరాలను సీసీటీవీ ఫుటేజీల ద్వారా నిందితులను పట్టుకున్నారు. ప్రస్తుత తరుణంలో పనిచేయని సీసీటీవీ కెమెరాలను బాగు చేసేందుకు అధికారులు చొరవ చూపాలని ప్రజలు, ప్రయాణీకులు కోరుతున్నారు.

రోడ్లపై వాన నీటితో అవస్థలు



రోడ్డుపై వర్షపు నీరు

హోసూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హో సూరు నగరంతోపాటు కృష్ణగిరి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. కాగా హోసూరు నగరంలో చాలాచోట్ల రోడ్లపై వర్షపు నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం సాయంత్రం ఒక మోస్తరు వర్షంతో కురిసిన కొద్దిసేపటికే క్రమంగా పెరుగుతూ వచ్చింది. పలు డ్రైనేజీలలో వర్షపునీరు చేరడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరింది. ద్విచక్రవాహనదారులతో పాటు ఇతర వాహనాల చోదకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.